# విద్యార్థులకు ఉచిత బస్ పాసులు

- 12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్ల లోపు బాలికలకు అవకాశం
- అమలాపురం ఆర్టీసీ డిపోలో ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు



ఆర్టీసీ బడి బస్సు




అమలాపురం డిపోలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో పాస్‌లు తీసుకుంటున్న విద్యార్థులు

**అమలాపురం రూరల్:** చదువుకునేందుకు నిత్యం సొంతూరి నుంచి ఇతర గ్రామాలు, పట్టణాలకు వెళ్లే విద్యార్థులకు ఆర్టీసీ ఏటా ఉచితంగా బస్ పాసులిచ్చి రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక బస్ సర్వీసులు నడుపుతుంది. విద్యార్థుల అక్షరాస్యత శాతం పెంచే లక్ష్యంతో ఎన్నో ఏళ్లుగా 12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్ల లోపు బాలికలకు ఆర్టీసీ ఉచిత బస్ పాస్‌లు కల్పిస్తున్న సంగతి తెలిసిందే. నిర్ణీత వయసు దాటిన విద్యార్థులకు బస్సు రూటు ఆధారంగా రాయితీపై పాస్‌లు ఇస్తున్నారు. ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక స్టేజీగా పరిగణలోకి తీసుకుని దూరాన్ని బట్టి రాయితీపై పాసులిస్తున్నారు.

ఈ నెల 12వ తేదీ బుధవారం నుంచి పాఠశాలలు తెరుచుకోనున్న నేపథ్యంలో ఈ ఏడాది అమలాపురం ఆర్టీసీ డిపోలో విద్యార్థుల కోసం ఇప్పటికే ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేసి పాసులిస్తున్నారు. ఆర్టీసీ ఇచ్చే ఈ బస్ పాసులు ఏడాది వరకూ చెల్లుబాటవుతాయి. పాస్ ధరతో పాటు సంవత్సరం గుర్తింపు కార్డు కోసం రూ.100, నెలవారీ గుర్తింపు కార్డు రూ.50, సరీ్వసు చార్జీ రూ.40 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. రాయితీ బస్ పాస్‌లు నెల, మూడు నెలలు, ఏడాది కాలపరిమితితో మంజూరు చేస్తున్నారు. గడువు ముగిశాక రెన్యువల్ కోసం ప్రిన్సిపాల్ సంతకం చేయించుకుని తిరిగి పొందాల్సి ఉంటుంది. సాధారణ విద్యార్థులకు జూన్ నుంచి ఏప్రిల్ వరకూ, ఐటీఐ, పారా మెడికల్ వంటి కోర్సులు చదివే వారికి మే నెలలో కూడా పాసులు మంజూరు చేస్తారు.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి**

అమలాపురం, ఉప్పలగుప్తం, అల్లవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, అంబాజీపేట, అయినవిల్లి మండలాలకు చెందిన విద్యార్థులు ఏటా అమలాపురం బస్ డిపో నుంచి బస్ పాస్‌లను పొందుతున్నారు. అమలాపురం డిపో నుంచి గతేడాది 6,000 మంది విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు, 3,500 మందికి రాయితీ బస్ పాస్‌లు, 3,000 మంది దివ్యాంగులకు రాయితీ బస్‌పాస్‌లు జారీ చేశారు. విద్యార్థులు బస్ పాస్ కోసం ఏపీఎస్ఆర్టీసీ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలి. కళాశాల విద్యార్థులు 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ జత చేయాలి. స్టడీ సర్టిఫికెట్‌తో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సెల్ నంబరు ఇవ్వాలి. దరఖాస్తులను సమీప డిపో మేనేజర్ పరిశీలించి పాసు మంజూరుకు సిఫార్సు చేస్తారు. వీటిని మంజూరు కౌంటరులో ఇచ్చి నిర్ణీత రుసుం చెల్లించి పాసు పొందొచ్చు.

**విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసులు**



50 కిలోమీటర్ల పరిధి వరకూ ప్రభుత్వం అందించే బస్సు పాసులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే డిపోలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి పాసుల జారీ ప్రారంభించాం. విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశాం. సదరం సర్టిఫికెట్ పొందిన దివ్యాంగులకు 50 శాతం రాయితీతో బస్సు పాస్‌లు ఇస్తున్నాం.

– చల్లా సత్యనారాయణమూర్తి, ఆర్టీసీ డిపో మేనేజర్, అమలాపురం

## క్లుప్తంగా

### సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దు

**అల్లవరం:** ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపుల్లో ఎవరైనా వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేసినా, కులాల మధ్య చిచ్చు పెట్టేలా మెసేజ్‌లు పంపినా వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని అల్లవరం ఎస్ఐ హరీష్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఎవరైనా వివాదాస్పద పోస్టులు పెడితే వెంటనే గ్రూప్ నుంచి డిలీట్ చేయాలని, లేదంటే గ్రూప్ అడ్మిన్స్‌పై సైతం చర్యలు తప్పవన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

### ఉపాధి కూలీలకు రూ.300 వేతనం ఇవ్వాలి



లచ్చిపాలెంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఈశ్వరరావు

**తాళ్లరేవు:** ప్రభుత్వం ప్రకటించినట్లుగానే రోజుకు రూ.300 వేతనం ఇవ్వాలని ఉపాధి కూలీలు డిమాండ్ చేశారు. గురువారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి.ఈశ్వరరావు, తణుకురాజు తదితరులు జార్జిపేట, లచ్చిపాలెం, పెదబాపనల్లి, తంగేటిపంపు గ్రామాల్లో ఉపాధి కూలీలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లుగా రూ.300 వేతనం పడడం లేదన్నారు. నిత్యవసర వస్తువుల ధరలన్నీ పెరిగిపోయాయని కనీసం రూ.300 వేతనం రాకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు.

### ధర్మ ప్రచార బ్రోచర్ ఆవిష్కరణ



ధర్మ ప్రచార బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

**ఐ.పోలవరం:** మండల పరిధిలోని కేశనకుర్రు పంచాయతీ కేశనకుర్రుపాలెం రామలింగేశ్వ స్వామి వారి ఆలయంలో సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ గాదిరాజు విశ్వనాథరాజు ఆధ్వర్యంలో గురువారం ధర్మ ప్రచార బ్రోచర్ ఆవిష్కరించారు. ఇంటింటా ధర్మ ప్రచారం చేయడం వల్ల మన ధర్మంలో ఉన్న నిగూఢమైన విషయాలు అందరూ ఆచరించడానికి అవకాశం ఉంటుందని ఆలయ ధర్మకర్త వేగిరాజు పెద్దబ్బాయిరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాళ్లకూరి కామేశ్వరశర్మ, వేగిరాజు గణపతిరాజు, గోపాలకృష్ణంరాజు, వేగిరాజు సూరిబాబు, తోటకూర బాబులురాజు, చింతా వివేక సత్యనారాయణ, సరిపెల్ల సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**రావులపాలెం:** మండలంలోని ఈతకోట, రావులపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈతకోట సెక్షన్ పరిధిలోని గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మీ పోలవరం, పొడగట్లపల్లి, మట్లదొడ్డి, దేవరపల్లి, వేదిరేశ్వరం, కోసూరునగర్, గరువు, కేతరాజుపల్లి, చెల్లిరేవు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. అలాగే రావులపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఊబలంక గ్రామం, రావులపాలెం డిగ్రీ కాలేజీ ఏరియా, అంకాలమ్మ గుడి ఏరియా ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి పదకొండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### 16న కవితోత్సవం

**సఖినేటిపల్లి:** తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఈ నెల 16న అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక, యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్, కల్చరల్ ఎఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి కవితోత్సవం ఏర్పాటు చేసినట్టు వేదిక అంతర్జాతీయ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ గురువారం తెలిపారు. సఖినేటిపల్లిలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, తిరుపతి కవితోత్సవం పేరిట నిర్వహించే ఈ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో 165 మంది కవులు పాల్గొంటారన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో కవిత్వం, సాహిత్య వ్యాప్తికి ప్రతి నెలా ఆయా జిల్లాల్లో ఒక్కో జిల్లా ప్రాతిపదికన జాతీయ స్థాయిలో కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నామన్నారు. సాహిత్య చరిత్రలో ఇటువంటి ఒరవడిని ఇపుడే తెచ్చామన్నారు.

### ఉన్నత విలువలు అలవరచుకోవాలి

**అంబాజీపేట:** విద్యార్థినీ, విద్యార్థులు చదువుతో పాటు ఉన్నత విలువలను అలవరచుకోవాలని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో పుస్తక పఠనాన్ని గురువారం చేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు గ్రంథాలయానికి రావడం వల్ల మేధాశక్తిని పెంచుకోవచ్చన్నారు. అనంతరం డ్రాయింగ్, నీతి కథలు, అల్లికలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

# వంతెన నిర్మాణంతో నిలిచిపోయిన సాగునీరు



బోడసకుర్రు పల్లిపాలెం వద్ద కాలువపై నిర్మాణంలో ఉన్న వంతెన

**అల్లవరం:** ఇందుపల్లి–అల్లవరం కాలువపై బోడసకుర్రు పల్లిపాలెం వద్ద నిర్మిస్తున్న వంతెన కారణంగా ఇందుపల్లి లాకుల వద్ద సాగునీరు నిలిచిపోయింది. ముందస్తు ఖరీఫ్ నేపథ్యంలో ఈ నెల 1న ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి దిగువ ప్రాంతాలకు సాగునీరు విడుదల చేశారు. కాలువలకు సాగునీరు విడుదల చేసి వారం కావస్తున్నా అల్లవరం కాలువకి చుక్క నీరు రాలేదు. బోడసకుర్రు నుంచి బెండమూర్లంక వరకూ ఏటిగట్టుపై సీఎస్ఆర్ నిధులతో రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. దీంట్లో భాగంగా వంతెన నిర్మాణం చేపట్టి పనులు నిర్వహిస్తున్నారు. అయితే వంతెన నిర్మాణంతో కాలువలకు సాగునీరు రాకుండా ఇందుపల్లి వద్ద అడ్డుకట్ట వేశారు. దీంతో ముందస్తు ఖరీఫ్‌కు అవాంతరాలు ఏర్పడ్డాయి. ముందస్తు ఖరీఫ్‌కు వ్యవసాయ శాఖ అధికారులు రైతులను సమాయత్తం చేస్తుంటే ఇరిగేషన్, పీఆర్ అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఖరీఫ్ ఆలస్యం అవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన కాలువలకు సాగునీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. వంతెన నిర్మాణ చేపట్టి రెండు వారాలు కావస్తున్నా నేటికి ఫిల్లర్ల స్థాయిలోనే ఉంది. వంతెనకు శ్లాబ్ పూర్తయితేనే తప్ప అడ్డుకట్ట తీసే అవకాశాలు కనిపించడం లేదు. దీనిపై ఇరిగేషన్ ఏఈ రెహమాన్‌ను వివరణ కోరగా అల్లవరం కాలువకి సాగునీరు విడుదల చేయడానికి మరో వారం రోజుల సమయం పట్టే అవకాశం ఉందని తెలిపారు.

# జాబ్ మేళాలో 68 మంది ఉద్యోగాలకు ఎంపిక



జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులతో కళాశాల యాజమాన్యం

**అమలాపురం టౌన్:** స్థానిక శ్రీవెంకటేశ్వరా ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 68 మంది ఉద్యోగావకాశాలు పొందారు. జిల్లా వ్యాప్తంగా 327 మంది అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు హాజరు కాగా 68 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సైనర్జనీ కంపెనీ సాంకేతిక అధికారులు తొలుత రాత పరీక్ష, అనంతరం ఇంటర్వ్యూ నిర్వహించి అభ్యర్థులను ఎన్నుకున్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు వార్షిక వేతనం రూ.3 లక్షలకు పైబడి ఉంటుందని కంపెనీ యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో కంపెనీ ఎండీ నల్లా సూర్యప్రకాశరావు, కళాశాల కరస్పాండెంట్ కేవీఆర్ఎస్ నరసింహారావు, ప్రిన్సిపాల్ కె.మనోహర్, చైర్‌పర్సన్ మల్లిపూడి విజయలక్ష్మి, ఏవో కరాటం ప్రవీణ్, నల్లా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లా పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు నైతిక విలువలు అలవరచుకోవాలి



ఉప్పలగుప్తం గ్రంథాలయంలో మాట్లాడుతున్న ఎంఈవో కిరణ్‌బాబు

**ఉప్పలగుప్తం:** విద్యార్థులు చిన్నతనం నుంచే నైతిక విలువలు అలవరచుకోవాలని ఎంఈవో కె.కిరణ్ బాబు అన్నారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా భీమనపల్లి, ఉప్పలగుప్తం గ్రంథాలయాల్లో గురువారం ఆయన పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారులు సలాది నాగేశ్వరరావు, నిమ్మకాయల శేషుబాబు సమక్షంలో జరిగిన సమావేశంలో విద్యార్థులకు వివిధ పద్యాలు, నీతి కథలను వివరించారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేవారు. కార్యక్రమంలో ఎంఈవో సత్తి సత్యకృష్ణ, ప్రముఖ కవి నల్లా నరసింహమూర్తి, అద్దంకి అమరేశ్వరరావు, కడలి శ్రీనివాసరావు, కావూరి మహేష్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు



బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందుకున్న విద్యార్థులు

**అమలాపురం టౌన్:** స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో గత 23 రోజులుగా జరుగుతున్న ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ అధ్యక్షతన జరిగిన ముగింపు సభకు శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణలు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. వేసవి శిక్షణా తరగతులతో విద్యార్థుల్లో విజ్ఞానంతో పాటు మానసిక వికాసం కూడా సాకారమైందన్నారు. గత 23 రోజులుగా విద్యార్థులకు పుస్తక పఠనం, యోగా, కథలు చెప్పడం, వినడం వంటి అంశాలపై అవగాహన కల్పించామని గ్రంథాలయాధికారి వర్మ తెలిపారు. విద్యార్థులకు యోగాలో శిక్షణనిచ్చిన యోగా గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్‌ను అభినందించారు. అనంతరం శిక్షణా తరగతుల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

# శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లి శనైశ్చరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**కొత్తపేట:** శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారిని గురువారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. వైశాఖ బహుళ అమావాస్య పర్వదినం పురస్కరించుకుని దేవదాయ–ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్వామివారి పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి శనివారం మాదిరిగా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా తైలాభిషేకాలు, పూజల ద్వారా దేవస్థానానికి రూ.1,33,075, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.10,620తో కలిపి మొత్తం రూ.1,43,695 ఆదాయం వచ్చినట్టు ఏసీ అండ్ ఈఓ విజయలక్ష్మి తెలిపారు. పట్టిసీమకు చెందిన భక్తుడు సత్యనారాయణగుప్తా అన్నదానం పథకానికి రూ.10,120 విరాళంగా అందజేసినట్టు తెలిపారు. పలువురు ప్రముఖులు, అధికారులు స్వామిని దర్శించుకున్నారు.

# ఇంటర్ ఉత్తమ విద్యార్థులకు సత్కారం



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

**పి.గన్నవరం:** ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం పి.గన్నవరంలో మమత స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. మమత స్వచ్ఛంద సేవా సమితి అందిస్తున్న సేవలను అభినందించారు. సమితి అధ్యక్షుడు జాన్ బర్త్ డే సందర్భంగా కేకును కట్ చేశారు. జెడ్పీ మాజీ ప్రతిపక్ష నేత సాకా ప్రసన్న కుమార్, ఎంఈఓ కోన హెలీనా, ఐఈ కుమార్, సాయితేజ విద్యాసంస్థల అధినేత అన్నాబత్తుల అనుబాబు, గ్రేస్ కళాశాలల ప్రిన్సిపల్ పీవీఆర్ నాయుడు, చెవ్వాకుల భరత్, నల్లా పెదకాపు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్స్ నక్కా శ్రీనివాస్, పెన్నేటి లలిత కుమారి, కె.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చండీ



అమ్మవారి ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

**ఆలమూరు:** మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి ఆలయంలో వైశాఖ మాస బహుళ అమావాస్యను పురస్కరించుకుని గురువారం అత్యంత వైభవంగా చండీహోమం జరిగింది. ఈఓ ఎంఎస్ఆర్ కృష్ణ, జేపీ డి.భాస్కర శ్రీనివాసు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు చండీ హోమంలో పాల్గొన్నారు. అనంతరం నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయ ఆవరణలో ప్రతి నెలా అమావాస్య రోజున చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఈఓ కృష్ణ తెలిపారు. భక్తులు స్థానిక దేవదాయశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆధ్యాత్మిక శిక్షణ తరగతులు



గుమ్మిలేరులో ఆధ్యాత్మిక తరగతులు నిర్వహిస్తున్న టీటీడీ ప్రాజెక్టు అధికారి ఆనంద తీర్థాచార్యులు

**ఆలమూరు:** మండలంలోని గుమ్మిలేరులో గురువారం హరే శ్రీనివాస భజన బృందానికి శిక్షణ తరగతులు జరిగాయి. ఆలమూరు అయ్యప్పస్వామి ఆలయ వ్యవస్థాపకుడు ఎం.ముకేందరస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఆధ్యాత్మిక శిక్షణ తరగతులకు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాజెక్టు అధికారి ఆనంద తీర్థాచార్యులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలమూరు, కపిలేశ్వపురం మండలాల నుంచి హాజరైన హరే శ్రీనివాస భక్త బృంద సభ్యులకు ఆధ్యాత్మికతను ప్రచారం చేయాల్సిన విధానాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ వేంకటేశ్వరుని చరిత్రను హిందువుల అందరికీ వివరించాలన్నారు.

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**రావులపాలెం:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్‌రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కళాశాలలో అవగాహన సదస్సు, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి పౌరుడు పర్యావరణాన్ని రక్షించాలని, దీనిలో భాగంగా మొక్కలు నాటాలన్నారు.

### అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



అమలాపురంలో కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహిస్తున్న పట్టణ సీఐ క్రిస్టోఫర్

**అమలాపురం టౌన్:** ఎవరైనా సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టే పోస్టింగ్‌లు పెట్టినా, అలర్లు సృష్టించేలా కవ్వింపు చర్యలకు పాల్పడినా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ కె.క్రిస్టోఫర్ హెచ్చరించారు. స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల నుంచి నల్ల వంతెన వరకూ దాదాపు 3 కిలోమీటర్ల మేర గురువారం సాయంత్రం కేంద్ర బలగాలతో కలిసి పట్టణ పోలీసులు కవాతు నిర్వహించారు. ఏదైనా హింసాత్మక ఘటన జరిగినా, అల్లర్లు చోటు చేసుకున్నా క్విక్ రియాక్షన్ టీములు ఐదు నుంచి పది నిమిషాల్లో అక్కడ ఉండి అల్లరి మూకలను చెదరగొడతారని ప్రజలకు సీఐ క్రిస్టోఫర్ వివరించారు. కవాతులో పట్టణ ఎస్ఐ కిషోర్‌బాబు పాల్గొన్నారు.

### అభివృద్ధి, సంక్షేమానికి కృషి

**యానాం:** పుదుచ్చేరి పార్లమెంటరీ స్థాన పరిధిలోని యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్లలో ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానని పుదుచ్చేరి ఎంపీగా రెండోసారి విజయం సాధించిన వి.వైథిలింగం పేర్కొన్నారు. గురువారం ఆయన పుదుచ్చేరిలో వివిధ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీకి దిగిన వైథిలింగం తన సమీప ప్రత్యర్థి నమశ్శివాయంపై 1.36 లక్షల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ, త్యాగి వి.సుబ్బయ్య, వెంకట సుబ్బారెడ్డియార్, అన్నాదురై విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వైద్యనాథన్, మాజీ మంత్రి కందసామి, డీఎంకే ఆర్గనైజర్ ఆర్.శివ, ఇండియన్ కమ్యూనిస్టు పార్టీ నేత ఏఎం సలీమ్ పాల్గొన్నారు.

### పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్‌కు 107 మంది హాజరు

**అయినవిల్లి:** ముక్తేశ్వరం వైవీఎస్ అండ్ బీఆర్ఎం కళాశాలలో గురువారం 2024 పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్‌కు 107 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.విశాల తెలిపారు. 1,08001 నుంచి చివరి ర్యాంకు వరకూ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. 107 మంది విద్యార్థులకు చెందిన సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేశామని తెలిపారు.

### వైభవంగా తాటమ్మ తీర్థం

**పి.గన్నవరం:** గ్రామంలో వేంచేసిన తాటమ్మ వారి తీర్థ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. గ్రామస్తులు, ఆడపడుచులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులు బ్యాండు మేళాలతో తరలి వచ్చి గరగలు తదితర మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఆలయం వద్ద ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వివిధ గ్రామాలకు వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ సుంకర రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.